క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యుడికి అండగా..



కదల్లేని స్థితిలో ఉన్న వ్యక్తిని లయోలా ఆశ్రమానికి తరలిస్తున్న వాసు, జ్యోతిర్మయి

అల్లిపురం: తెలుగు తల్లి ఫ్లైవోవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఒకరు కాళ్లు చేతులు చచ్చుబడిపోయి, కదల్లేని స్థితిలో ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు స్పందించారు. టీఎస్‌ఆర్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి సహకారంతో అతడిని అక్కడి నుంచి తరలించి పెందుర్తి లయోలా హోమ్‌లో శుక్రవారం చేర్పించి ఆశ్రయం కల్పించారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్‌ఐ ఎం.రవికుమార్, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ - 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకునేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురి చేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు.

నైపుణ్య సాధనతో ఉన్నతావకాశాలు

మురళీనగర్ : విద్యార్థులు వారు చదువుతున్న కోర్సుకు సంబంధించిన నైపుణ్యాలు సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు పొందుతారని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో ఐఎస్‌టీడీ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌టీడీ గౌరవ కార్యదర్శి డాక్టర్ వై.హేమ విద్యార్థులకు ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ విధివిధానాలను వివరించారు. సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ సీఈవో పి.సునీల్, కాలేజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా..

- కెరీర్‌లో రాణిస్తున్న యువత
- చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉన్నత శిఖరాలకు
- విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్న జవహర్ నాలెడ్జి కేంద్రం



క్యాంపస్ డ్రైవ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు



జేకేసీ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



గ్రూప్ డిస్కషన్‌లో విద్యార్థినులు

డాబాగార్డెన్స్: ఇది డిజిటల్ యుగం. లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోను, ఇంటర్నెట్ ఆధారిత మాధ్యమాల ద్వారానే జరిగిపోతున్నాయి. ఈ వ్యవహారాల్లో మనం ఇక్కడ ఉండి ఎక్కడి వారితోనో అనుసంధానమై పని చేయాల్సి ఉంటుంది. ఈ తరుణంలో భాషా పటిమ, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎటువంటి వారికైనా తప్పనిసరి. అయితే ఈ విషయంలో చాలా మంది యువత ఒకింత కింది మెట్టు మీదే ఉన్నారని పలు గణాంకాలు చెబుతున్నాయి. కెరీర్‌లో ఉన్నతంగా రాణించాలంటే పైన చెప్పుకున్నట్లు భాషా పటిమ, కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి. వాటిలో పట్టు సాధిస్తే గ్లోబలైజేషన్ హద్దుల్లో ప్రయాణిస్తున్న ప్రపంచంలో ఎంత సుదూర తీరంలోనైనా ఇట్టే రాణించవచ్చు. యువతకు అటువంటి నైపుణ్యాన్ని అలవరిచే బృహత్తర కార్యక్రమాన్ని తలకెత్తుకుంది జవహర్ నాలెడ్జి కేంద్రం (జేకేసీ). వారిని కెరీర్ బెస్ట్‌గా తీర్చిదిద్దేందుకు ఇతోధికంగా శ్రమిస్తోంది. పాత జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జి కేంద్రం ఉన్నత విద్యా విభాగంలో విద్య-ఉద్యోగితలను అనుసంధానిస్తూ, విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దుతోంది. విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత, అభివృద్ధే లక్ష్యంగా జేకేసీ గురుతర బాధ్యతను పోషిస్తోంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచుతూ, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తోంది. కళాశాలల్లో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ వారిని ఉద్యోగులుగా మారుస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోంది జవహర్ నాలెడ్జి సెంటర్.

ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం..



ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో సులువుగా రాణించేలా వారిని జవహర్ నాలెడ్జి కేంద్రం తీర్చిదిద్దుతోంది. విభిన్న రంగాల్లో విద్యార్థులు రాణించేలా వారి నైపుణ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వారికి ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తోంది. కళాశాలల్లో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. తద్వారా వారు చదువు పూర్తవగానే ఉద్యోగులుగా మారుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా కొత్త బాటలు వేస్తోంది జవహర్ నాలెడ్జి సెంటర్.

డాక్టర్ ఎస్.శోభారాణి, కళాశాల ప్రిన్సిపాల్

విద్యార్థులకు వరం.. జేకేసీ

పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ మెండుగా ఉంటేనే రాణించగలం. జేకేసీ అనేది విద్యార్థులకు గొప్ప అవకాశం. విద్యా సంవత్సరం ముగిసిన నాటికి ఉపాధి రంగాల్లో స్థిరపడేలా అవసమైన తర్ఫీదు ఇస్తున్నాం. ప్రధానంగా ఆంగ్లంలో మాట్లాడడంతో పాటు ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి.. సమకాలీన అంశాలను ఎలా అవగాహన చేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యావంతులైన యువతకు ఉపాధి రంగాల్లో చాలా అవకాశాలున్నాయి. కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన పొంది ఉద్యోగావకాశాలు పొందాలి.


డి. అరుణపద్మ, జేకేసీ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పొందా..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ డిగ్రీ పూర్తి చేశాను. కళాశాలలో ఉన్న జేకేసీ ద్వారా శిక్షణ పొందాను. శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో అవగాహన కల్పించడమే కాకుండా మాట్లాడే విధానం, మెలకువలు కళాశాల ఇంగ్లీషు అధ్యాపకులు జేకేసీ ద్వారా తర్ఫీదు ఇచ్చారు. ఫలితంగా జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇండియన్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్‌కు ఎంపికయ్యా.

సీహెచ్ రాజ్యలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థిని

కోటవీధిలో శ్వేతనాగు కలకలం



వలలో చిక్కుకుని పడగ విప్పుతున్న శ్వేతనాగు



శ్వేతనాగును గోనె సంచిలోకి తరలిస్తున్న కిరణ్



వలలోని పామును చాకచక్యంగా పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ కిరణ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి 39వ వార్డు కోటవీధి కన్నె మరియమ్మ గుడికి వెళ్లే దారిలో శుక్రవారం ఉదయం ఎనిమిది అడుగుల 'శ్వేతనాగు' కలకలం సృష్టించింది. అటుగా వెళ్తున్న కొందరు ఈ పామును చూసి బెంబేలెత్తారు. స్థానికుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్థానికులు పాము ప్రత్యక్షమైన ప్రాంతానికి చేరుకుని స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కు ఫోన్ చేశారు. నగర శివార్లలో ఉన్న స్నేక్‌క్యాచర్ హుటాహుటిన పాము ప్రత్యక్షమైన ప్రాంతానికి చేరుకుని ఎనిమిది అడుగుల పైబడి ఉన్న ఆ పామును చాకచక్యంగా పట్టుకున్నారు. గోనెసంచిలో పాముని తీసుకెళ్లి అడవిలో వదిలేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పాములంటే మనకి ఎంత భయమో.. మనుషులంటే వాటికీ అంతే భయమని, పాములు ఎక్కడున్నా తన దృష్టికి తీసుకు వస్తే పట్టుకుని అడవిలో వదిలేస్తానని తెలిపారు. పాముల్ని ఎట్టి పరిస్థితిల్లోనూ చంపవద్దని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాములు ఎక్కడైనా తారస పడితే 88663 68899 నంబరుకు ఫోన్ చేయాలని కిరణ్ కోరారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి : డీఎంహెచ్‌వో



దొండపర్తిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : దొండపర్తిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మంచి నీటిపై మూతలు సరిగా పెట్టుకోవాలని స్థానికులకు తెలిపారు. డెంగ్యూ నివారణ పద్ధతులు, మలేరియా నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల మీద వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష జరిపారు. వైద్యాధికారి డాక్టర్ ఎస్.రమారెడ్డి, స్థానిక వైద్యులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు



పరీక్షా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్‌ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయిదుర్గ హర్షవర్ధన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్షా కేంద్రం నుంచి ఉసూరుమంటూ బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరి విద్యార్థులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వలేకపోయమని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

బ్యాడ్మింటన్‌లో త్రిషాలి, శ్రీకృష్ణకు స్వర్ణాలు



వితోలి బ్యాడ్మింటన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: అమరావతి వీఐటీలో నిర్వహించిన వితోలి బ్యాడ్మింటన్ టోర్నీలో జి.త్రిషాలీ వుమెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో పి.విన్సీ (కె.ఎల్.యూ)పై 21-8, 21-8 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుంది. మెన్ ఫైనల్ సింగిల్స్‌లో శ్రీకృష్ణ 2-0 సెట్ల తేడాతో యశ్వంత్ (కె.ఎల్.యూ)పై, డబుల్స్‌లో ఎ.రూపేష్‌తో కలిసి స్ట్రయిట్ సెట్లలోనే సుల్తాన్-ఆదిత్య (వీఐటీ) జోడీపై విజయం సాధించి స్వర్ణాలందుకున్నారు. గీతం విద్యార్థులైన వీరంతా నాలుగు కేటగిరీల్లో పాల్గొని మూడు పతకాలు సొంతం చేసుకున్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాల పైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్-1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజా సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్-3 నుంచి పాతరేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సర్టిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి.ఎస్.మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్-4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్-5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్‌ఎం)గా పని చేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.

మీ సలహాలు..సూచనలు ఎంతో అవసరం

- స్వచ్ఛభారత్ అంబాసిడర్లతో జీవీఎంసీ కమిషనర్ వర్చువల్ సమావేశం



స్వచ్ఛభారత్ అంబాసిడర్లతో జీవీఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్

డాబాగార్డెన్స్: స్వచ్ఛభారత్ అంబాసిడర్ల సూచనలు, సలహాలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు తెలిపారు. స్వచ్ఛభారత్ అంబాసిడర్లతో శుక్రవారం జూమ్‌యాప్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు, పర్యావరణానికి స్వచ్ఛ భారత్ అంబాసిడర్ల కృషి ఎంతో ఉందన్నారు. నగరంలో మార్చిలో రెండు సదస్సులు నిర్వహిస్తామని.. అందుకు విశాఖను సుందరంగా తీర్చిదిద్దేందుకు మీ సలహాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్లాస్టిక్ నిర్మూలన, పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించామని, గతంలో 10 టన్నుల వరకు ప్లాస్టిక్ ఉత్పత్తి అయ్యేదని, నిషేధం విధించిన తర్వాత దాదాపు మూడు టన్నులే ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రత్యామ్నాయ వస్తువుల కోసం 10 కియోస్కు సెంటర్లను నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. తద్వారా తక్కువ ధరకే క్యారీ బ్యాగులు, పేపర్ ప్లేట్లు, ఉడ్‌స్పూన్స్ వంటివి లభిస్తాయన్నారు. నగరంలో వీధి కుక్కలు, పందుల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ ర్యాంకే లక్ష్యంగా నగరంలో పారిశుధ్య పనులు, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగర సుందరీకరణకు అంబాసిడర్లు సలహాలు ఇవ్వాలన్నారు. స్వచ్ఛభారత్ అంబాసిడర్లు మాట్లాడుతూ నగర సుందరీకరణ పనులు చాలా అద్భుతంగా ఉన్నాయని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పారిశుధ్య పనుల నిర్వహణ అమలు తీరు బాగుందన్నారు. వీధి కుక్కల కోసం ప్రత్యేక షెల్టర్ ఏర్పాటు చేయాలని, చాలా చోట్ల వీధి వ్యాపారులు రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని, ఆక్రమణల వల్ల నగర సుందరీకరణకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. చాలా ప్రాంతాల్లో మొక్కలను ట్రిమ్మింగ్ చేయకపోవడం వల్ల స్కూల్ బస్సుల్లో వస్తున్న విద్యార్థులకు చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదం వాటిల్లుతుందని, అందుకు చెట్లకు ట్రిమ్మింగ్ చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మీరు తెలిపిన ప్రతి విషయం నోట్ చేసి, అవి అమలుకు కృషి చేస్తామన్నారు. స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్, పీఎల్‌కే మూర్తి, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఏయూ మాజీ వీసీ ఆచార్య జీఎస్‌ఎన్ రాజు, సాంబశివరావు, విజయ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు చక్కటి స్పందన



36వ వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



34వ వార్డు ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్ వైఎస్సార్ విగ్రహం వద్ద, 36వ వార్డు జామియా మసీదు వద్ద ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి అధికారులతో మాట్లాడి పరిష్కరించమని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, 36వ వార్డు ప్రెసిడెంట్ మాసిపోగు రాజు, 35వ వార్డు ప్రెసిడెంట్ అలపన కనకరెడ్డి, సీనియర్ నాయకులు జెర్రిపోతుల ప్రసాద్, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, బోణి దేవ, దశమంతుల మాణిక్యాలరావు, 34వ వార్డు నాయకులు, వార్డు ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, లింగం శ్రీనివాసరావు, బొడ్డేటి ప్రసాద్, దూడ అప్పారావు, తాతబ్బాయి, వెంకటేష్, వాసుపల్లి నారాయణరావు, ఖాజావల్లి, సాగర్, రామరాజు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



అంబికాబాగ్‌లో వెలసిన సీతారామచంద్ర స్వామి



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష

- నేటి నుంచి టికెట్ల విక్రయాలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. వచ్చే నెల 28 నుంచి ఏప్రిల్ 2వరకు నిర్వహించనున్న నవమి వేడుకలను పురస్కరించుకుని ఉత్సవ ఏర్పాట్లపై ఆలయ ఈవో కె. శిరీష శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చర్చించారు. ప్రతి ఏటా నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తులకు మెరుగైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి ఏడాదిలాగే ఉభయదాతలచే నిర్వహించే కల్యాణానికి రుసుం రూ.1,116గా నిర్ణయించి, గత సంవత్సరం వలే నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 25 (శనివారం) నుంచి సీతారామ కల్యాణ వేడుకల టికెట్లు అంబికాబాగ్‌తో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానంలో కూడా విక్రయించాలని సిబ్బందిని ఆదేశించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని శిరీష కోరారు. క్షేత్ర పర్యటనలో ఆలయ కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, సహాయ ఇంజనీరు కేఎస్‌ఎన్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్నులకు ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఇటీవల ఎంతో మందికి ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే వాసుపల్లి తాజాగా శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులు స్వీకరిస్తూ వెంటనే స్పందించడం.. ఆ ఫిర్యాదుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సొంత నిధులతో సహకరిస్తున్నారు. శుక్రవారం సుమారు రూ. 30 వేల ఆర్థిక సాయం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో వివిధ కారణాల వల్ల ఆర్థిక సాయం కోరిన వారికి అందజేశారు. 39వ వార్డు దూడావారి వీధిలో నివసిస్తున్న కర్రి త్రినాథ్ కుమారుడు 12 ఏళ్ల నాగచైతన్య కొంత కాలంగా జెనెటిక్ సమస్యతో బాధపడతున్నాడని, మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తీసుకెళ్లడానికి, మందుల ఖర్చులకు ఆర్థిక సాయం అందజేయాలని ఎమ్మెల్యేని కోరాగా, ఎమ్మెల్యే స్పందించి తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు అందజేశారు. 41వ వార్డు రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో నివసిస్తున్న కీర్తి అమ్మాజీ, భర్త ప్రసాద్ తమ పిల్లల చదువు కోసం ఫీజులు కట్టలేక, ఇంటి అద్దె కట్టుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడతున్నామని ప్రజాదర్బార్‌లో చెప్పుకోగా, రూ.10 వేలు అర్థిక సాయం అందజేశారు. 34వ వార్డు అల్లిపురం నరహరి వీధికి చెందిన కడవల నాగేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మంచాన పట్టాడు. జీవనోపాధి లేక, మందుల ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేయమని కోరగానే రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. 41వ వార్డు జ్ఞానాపురం మేనుయల్ వీధిలో నివసిస్తున్న గొలగాని జగదీశ్వరి భర్త వేళంగినిరాజు పక్షవాతం కారణంగా జీవనోపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు ఆ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ తెలియజేయగానే మానవతాదృక్పథంతో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బెహరా హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో డాక్టర్ బెహరా విజయరవితేజ, డాక్టర్ నరేంద్ర పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని తెలియజేశారు.